సాక్షి
నంద్యాల

ఆదివారం । 22 । జనవరి । 2023



దర్గాలో భక్తుల సందడి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు శనివారం అమావాస్య సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



దేవరగట్టులో పూజలు

హొళగుంద: దేవరగట్టు క్షేత్రంలో వెలసిన మాళ మల్లేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు స్వామి వారిని దర్శించుకున్నారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,619.31
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 59,415
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 8,652

న్యూస్‌రీల్

వెదురు సేకరణకు చర్యలు



రేంజ్ అధికారి శ్రీపతినాయుడు

రుద్రవరం: వెదురు సేకరణకు ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు తెలిపారు. స్థానిక అటవీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఏటా సెప్టెంబర్ నెలలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి అక్టోబర్ నెలలో వెదురు సేకరణ, వేలం పాటలు చేపట్టాల్సి ఉండగా శాఖా పరమైన సర్వే కారణంగా జాప్యమైందన్నారు. ఈ నెల 19న రుద్రవరం, చెలిమ రేంజ్ పరిధిల్లోని పలు కూపుల్లో వెదురు సేకరణ, రవాణా, గ్రేడింగ్ తదితర పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియ నిర్వహించామన్నారు. ఆయా పనులకు సంబంధించి కాంట్రాక్టర్లు టెండర్లు వేశారని వాటిని పరిశీలించి త్వరలో అనుమతులు ఇస్తామన్నారు. రుద్రవరం రేంజ్‌లోని సిల్లమానుపెంట, గొర్రెగుంత, ఎంఎం చెలిమ, అహోబిలం నుంచి దాదాపు 2.76 లక్షలు, చెలిమ రేంజ్‌లో దాదాపు 5 లక్షల వెదుర్లు సేకరించి గాజులపల్లె డిపోలో వేలం నిర్వహిస్తామన్నారు.

వెబ్‌సైట్‌లో ఉపకార వేతన పరీక్ష హాల్‌టికెట్లు

నంద్యాల(సిటీ): జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) హాల్ టికెట్లను వెబ్ సైట్‌లో అందుబాటులో ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ శనివారం తెలిపారు. ఫిబ్రవరి 5వ తేదీన నిర్వహించే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు www.bse.ap.gov.in నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. సంబంధిత ఉపాధ్యాయులు పాఠశాల యూ–డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి తమ విద్యార్థుల హాల్ టికెట్లను అందించాలని డీఈఓ తెలిపారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదు



మహిళా పోలీసులకు సూచనలిస్తున్న ఎస్పీ

బొమ్మలసత్రం: కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షకు అభ్యర్థులు ఉదయం 10 గంటలలోగా పరీక్ష కేంద్రానికి చేరాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్ష నిమిత్తం స్థానిక ఎస్పీ కార్యాలయ ఆవరణలో శనివారం సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు అందించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమణ, డీఎస్పీ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాములేటి స్వామి శివైక్యం



నంద్యాల(వ్యవసాయం): ప్రముఖ ఆధ్యాత్మిక, యోగా గురువు అచల పరిపూర్ణనంద పాములేటి స్వామి శనివారం తెల్లవారుజామున శివైక్యం పొందారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని స్ఫటిక లింగేశ్వర ఆశ్రమంలో 40 ఏళ్లుగా ఉచిత యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ వేలాది మందికి యోగా నేర్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఆయన శిష్యులు యోగాలో రాణిస్తున్నారు. 20 ఏళ్లుగా ప్రతి నెల పౌర్ణమిన లోక కల్యాణం కోసం హోమాలు నిర్వహించారు. ఆయన భౌతిక కాయానికి ఎమ్మెల్యేలు శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆశ్రమంలో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు.

25 ఏళ్లుగా కోవా తయారీ



మేము ఐదుగురు కుటుంబ సభ్యులం. అందరం కలిసి రోజూ 30 నుంచి 40 కిలోల కోవా తయారు చేస్తాం. 25 ఏళ్లుగా ఈ వ్యాపారంలో ఉన్నాం. నంద్యాల, బనగానపల్లి, కోడుమూరు నుంచి స్వీట్ వ్యాపారులు వచ్చి కోవాను తీసుకెళ్తారు. రాష్ట్రంలోని వివిధ పట్టణాల నుంచి ఏడెనిమిది ఆర్డర్లు వస్తాయి. వీటిని కొరియర్ సర్వీస్‌ల ద్వారా పంపుతాం. అన్ని ఖర్చులు పోను రోజుకు రూ.1,200 నుంచి రూ.1,500 వరకు మిగులుతోంది.

– మహబూబ్‌బాషా, తడకనపల్లి

రోజూ 60 కిలోల కోవా తయారు చేస్తాం



నా చిన్న తనం నుంచి పాలకోవ తయారు చేస్తున్నాం. 25 ఏళ్లుగా ఇదే ప్రధాన ఉపాధి. రోజుకు 60 కిలోల కోవా తయారు చేస్తాం. పాలు కిలో రూ.54 ప్రకారం సేకరిస్తాం. హైదరాబాద్, బెంగళూరు వంటి పట్టణాల నుంచి కూడా ఆర్డర్‌లు వస్తున్నాయి. తడకనపల్లి పేరుతోనే కోవాకు డిమాండ్ వచ్చింది.

– హజరాంబీ, గులాబీ పొదువు గ్రూపు సభ్యురాలు

మాదే మొదటి కుటుంబం



మా నాన్న షేక్ శాలీసాహెబ్ 1940లో కోవా తయారీని ప్రారంభించారు. గ్రామంలో మాదే మొదటి కుటుంబం. అప్పట్లో 10 లీటర్ల పాలతో కోవా చేసేవాళ్లం. ఆయన తర్వాత మాకు కోవా తయారీనే ఉపాధి కల్పిస్తోంది. ప్రస్తుతం రోజూ 100 కిలోలకు పైగా కోవా తయారు చేస్తున్నాం. రాష్ట్రంలోని ప్రధాన పట్టణాలకు మా కుటుంబం నుంచే కోవా ఎగుమతి అవుతోంది.

– జుబేదా, తడకనపల్లి



బెల్లం పాలకోవ

చక్కెర పాలకోవ

పిక్క పాలకోవ

బ్రాండ్‌గా 'తడకనపల్లి పాలకోవా'

- వందేళ్ల క్రితం మొదలై నేడు కుటీర పరిశ్రమగా ఉపాధి
- దేశంలోని ప్రధాన నగరాలకు ఎగుమతి
- రోజుకు 1,200 కిలోలకుపైగా తయారీ
- ప్రతి నెలా రూ.కోటి వరకు టర్నోవర్



పాలకోవా తయారీ దృశ్యం

ఊరు తియ్యన.. ఉపాధి కమ్మన

SUNDAY SPECIAL

కర్నూలు(అగ్రికల్చర్): ఆత్రేయపురం పూతరేకులు.. కాకినాడ కాజా.. బందరు లడ్డూ.. ఈ కోవలోనే ఇప్పుడు తడకనపల్లి పాలకోవా చేరిపోయింది. కర్నూలు నగరానికి 20 కిలోమీటర్ల దూరంలో కల్లూరు మండలంలోని తడకనపల్లి గ్రామం పేరు ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వినిపిస్తుంది. పాలకోవాకు ఈ గ్రామం బ్రాండ్‌గా మారింది. ఇక్కడ తయారై దేశ, విదేశాలకు ఎగుమతి అవుతోంది. కల్లూరు మండలం చిన్నటేకూరు మీదుగా వెళ్తున్న జాతీయ రహదారి నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న తడకనపల్లికి నిత్యం పాలకోవా కోసం వందలాది మంది వచ్చి వెళ్తున్నారు. 650 కుటుంబాలు ఉన్న ఈ గ్రామంలో శతాబ్దకాలంగా పాలకోవ తయారీ సాగుతుండగా.. నేడు గ్రామంలో కుటీర పరిశ్రమగా మారింది. పాల ఉత్పత్తి, తద్వారా కోవా తయారీని మరింత పెంచేందుకు ప్రభుత్వం డీఆర్‌డీఏ–వైకేపీ ద్వారా ప్రోత్సహిస్తోంది. ప్రతి నెలా ఈ గ్రామంలో పాల కోవా వ్యాపారం దాదాపు రూ.కోటి వరకు ఉంటోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మంది ఉపాధి పొందుతుండటం విశేషం.

రోజుకు 1,200 కిలోలకుపైగా తయారీ

వందేళ్ల నుంచి తడకనపల్లిలో పాలకోవా తయారవుతున్నా.. 1940 నుంచి వెలుగులోకి వచ్చింది. అప్పట్లో 10 లీటర్ల పాలతో పాలకోవా తయారు చేస్తుండగా.. నేడు 3వేల లీటర్లకు చేరుకుంది. 20 కుటుంబాలు పూర్తిగా కోవా తయారీపైనే పైనే ఆధారపడ్డాయి. 3వేల లీటర్లు వినియోగిస్తే 1,200 కిలోల కోవా



డ్వాక్రా బజారులో అమ్మకానికి పెట్టిన తడకనపల్లి పాలకోవ

తయారవుతుంది. చక్కెరతో పాటు బెల్లంతోనూ తయారు చేస్తున్నారు. ఆర్డర్‌లను బట్టి పిక్కా కోవా కూడా సిద్ధం చేస్తున్నారు. పిక్కాకోవాకు ప్రతి నెలా 1000–1500 కిలోల వరకు ఆర్డర్‌లు వస్తున్నాయి. గ్రామంలో ఉత్పత్తి అవుతున్న పాలు సరిపోక చుట్టుపక్కల ఉన్న వాముసముద్రం, బైరాపురం, లొద్దిపల్లి తదితర గ్రామాల నుంచి 1000 లీటర్లు సేకరిస్తున్నారు. 1000 గ్రాములు, 500 గ్రాములు, 250 గ్రాముల ప్యాకింగ్‌లో కోవాను విక్రయిస్తున్నారు.

ప్రధాన పట్టణాల నుంచి ఆర్డర్‌లు

తడకనపల్లి పాలకోవ కోసం దేశ రాజధాని ఢిల్లీతో పాటు హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్టణం, విజయవాడ, గుంటూరు తదితర నగరాల నుంచి ఆర్డర్‌లు వస్తున్నాయి. రోజుకు 1,200 కిలోల కోవా తయారు చేస్తే 400 కిలోలు ప్రసిద్ధ నగరాలకు ఎగుమతి అవుతోంది. 800 కిలోల్లో 50 శాతం జిల్లాలోని వివిధ పట్టణాలకు చెందిన స్వీట్ వ్యాపారులు.. మిగిలిన 50 శాతం చిన్న, చిన్న వ్యాపారులు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. వివాహాది శుభకార్యాలు ఉన్నప్పుడు పాలకోవాకు మరింత డిమాండ్ ఉంటోంది. ఆ సమయంలో రోజుకు 1,500 కిలోల వరకు తయారు చేస్తున్నారు. స్వచ్ఛమైన పాలు వినియోగిస్తుండటం, కోవా తయారీలో 100 శాతం స్వచ్ఛత ఉండటం వల్ల తడకనపల్లి పాలకోవాకు ఈ స్థాయిలో గుర్తింపు లభిస్తోంది.

దేశంలోనే మొదటిసారిగా పశువులకు హాస్టల్

తడకనపల్లిలో పశువులకు ప్రత్యేకంగా దేశంలోనే మొదటి సారిగా హాస్టల్ ఏర్పాటైంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు, స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌తో 300 పశువుల సామర్థ్యం ఉన్న హాస్టల్‌ను ఇక్కడ నిర్వహిస్తున్నారు. పశుగ్రాసాల కోసం 10 ఎకరాల భూమిని కూడా ప్రభుత్వం కేటాయించింది. ప్రస్తుతం ఈ హాస్టల్‌లో 100 వరకు పశువులు ఉంటున్నాయి. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పశువుల హాస్టల్ ఏర్పాటు కాగా గ్రామంలోని స్వయం సహాయక సంఘాలు దీనిని నిర్వహిస్తున్నాయి.

మొత్తం కుటుంబాలు: **650** / పాలకోవా తయారీ కుటుంబాలు: **20**

రోజువారీ పాల వినియోగం: **3**వేల లీటర్లు

రోజూ తయారవుతున్న పాలకోవా: **1,200** కిలోలు

పాలకోవా రకాలు: చక్కెర, బెల్లం, పిక్కా

గ్రామంలోని పాడి పశువులు: **500** రోజూ పాల ఉత్పత్తి: **2**వేల లీటర్లు

కిలో ధరలు ఇలా...

చక్కెర పాలకోవా: రూ.**200** / బెల్లం పాలకోవా: రూ.**300**

పిక్కా పాలకోవా: రూ.**450**

బార్‌లో పని మాని పాలకోవా విక్రయం

ఈ వ్యక్తి పేరు ఎం.శంకర్. కర్నూలు నగరంలోని ఎస్‌టీబీసీ నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మూడేళ్ల క్రితం వరకు ఒక బార్‌లో పనిచేస్తూ.. కరోనా లాక్‌డౌన్, కర్ఫ్యూ తర్వాత తడకనపల్లి పాలకోవా విక్రయాన్ని ఉపాధిగా ఎంచుకున్నాడు. కర్నూలు నుంచి ప్రతి రోజు తడకనపల్లికి వెళ్లి 20 కిలోల వరకు పాలకోవ తెచ్చుకుంటాడు. నగరంలోని రవి థియేటర్(సెంట్రల్ ప్లాజా సమీపం) ఎదుట బండిపై పెట్టుకొని కిలో రూ.230 చొప్పున విక్రయిస్తున్నాడు. ఉదయం 11 నుంచి సాయంత్రం 7 గంటల వరకు రోజూ 15–16 కిలోల పాలకోవా అమ్ముడవుతోంది. అన్ని ఖర్చులు పోను రూ.400 ఆదాయం ఉంటోంది. ఒకరి కింద పనిచేసే కన్నా ఈ పాలకోవా వ్యాపారం ఎంతో సంతృప్తిని ఇస్తోందంటున్నాడు.



త్వరలో కేజీ రోడ్డుకు మరమ్మతులు

- ఆలూరులో జింకల పార్కు ఏర్పాటుకు కృషి
- రూ.20 కోట్లతో కోడుమూరులో తాగునీటి ఎద్దడి నివారణ
- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ సమావేశంలో ఎంపీ సంజీవ్‌కుమార్
- హాజరైన కో చైర్మన్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యేలు



దిశ సమావేశంలో పాల్గొన్న ఎంపీలు సంజీవ్‌కుమార్, పోచా బ్రహ్మానందరెడ్డి, కలెక్టర్ కోటేశ్వరరావు, ఎమ్మెల్యేలు కాటసాని, సుధాకర్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు – గుంటూరు రహదారికి త్వరలోనే మరమ్మతులు చేపడతామని, ఈ మేరకు నిధులు మంజూరు చేయించానని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశ) చైర్మన్, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి చైర్మన్, కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, కోచైర్మన్, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, కలెక్టర్ పి.కోటేశ్వరరావు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జె. సుధాకర్‌తోపాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. కమిటీ చైర్మన్ హోదాలో ఎంపీ సంజీవ్‌కుమార్ మాట్లాడారు. డ్రోన్ల కొనుగోలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు ఇస్తున్నాయన్నారు. వాటి వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లా స్థాయిలో 44 కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఆలూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో జింకల బెడదను నుంచి రైతులను విముక్తి చేసేందుకు ఆలూరులో పార్కును ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సమస్య చాలా రోజుల నుంచి ఉందని, కేంద్రం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రూ.20 కోట్లతో కోడుమూరులో నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాకు మంజూరైన 18 అర్బన్ హెల్త్‌సెంటర్లలో 12 పూర్తయ్యాయని, మిగిలిన వాటిని కూడా త్వరగా నిర్మించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్యకు సూచించారు. జలకళ ద్వారా బోర్లు వేసుకున్న రైతులకు త్వరగా విద్యుత్ కనెక్షన్‌లు ఇవ్వాలన్నారు. కో–చైర్మన్ పోచా బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ.. బ్రాహ్మణ కొట్కూరు పీహెచ్‌సీలో సిబ్బంది లేరని, వెంటనే నియమించాలని ఆదేశించారు. శ్రీశైలంలోడ్యామ్‌లో పూడిక తీసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ చిన్నటేకూరులో రోడ్డు సమస్యను తక్షణమే పరిష్కరించాలన్నారు. కలెక్టర్ పి.కోటేశ్వరరావు మాట్లాడుతూ..జిల్లాలో వలసల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు, మహిళలకు పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం బాలిక సంరక్షణ దినోత్సవం సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నంద్యాల డీఆర్వో బి.పుల్లయ్య, డ్వామా పీడీ అమరనాథ్‌రెడ్డి, జిల్లా దిశ కమిటీ సభ్యులు పాలకుర్తి రమేష్, ఇల్లూరు నరసింహ, కృష్ణారెడ్డి, రాజు, రమేష్‌గుప్తా, వాణి తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో భరత్‌కుమార్‌రెడ్డి, పీపీ నాగిరెడ్డి

నంద్యాల: జిల్లాలో రసాయనిక ఎరువుల కృత్రిమ కొరత సృష్టించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలు, యూరియా, ఎరువుల కొరతపై రోజూ వార్తాపత్రికల్లో కథనాలు వెలువడుతున్న నేపథ్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా దాడులు చేయాలన్నారు. రసాయనిక ఎరువులను డీలర్లు ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, బ్లాక్ మార్కెటింగ్‌కు తరలించినా చట్ట ప్రకారం సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రబీ సీజన్‌లో 3,26,296 ఎకరాలు సాగవుతుండగా ఇప్పటివరకు 2,18,443 ఎకరాలకు మాత్రమే ఈ క్రాప్ బుకింగ్ జరిగిందని, మిగిలిన పంటకు ఈ క్రాప్ బుకింగ్ వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పీఎం కిసాన్ ఆర్థిక సహాయానికి పెండింగ్‌లో ఉన్న 33,190 మంది రైతుల ఈ–కేవైసీని వెంటనే పూర్తి చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ – పంట నమోదుపై రైతులకు సంపూర్ణ అవగాహన కల్పించి వంద శాతం పూర్తిచేయాలన్నారు. ఖరీఫ్‌కు సంబంధించి అనుమానాస్పద అకౌంట్‌లు ఉన్న రైతులు వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల నుంచి శనగల కొనుగోలుకు ప్రొక్యూర్మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్‌బీకేల నుంచి రైతులకు మరిన్ని సేవలు అందాలని పేర్కొన్నారు. మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి మాట్లాడుతూ గోస్పాడు మండలంలో ఆత్మహత్య చేసుకున్న రైతులకు ఇప్పటివరకు పరిహారం అందించలేదని సంబంధిత వివరాలు తెలపాల్సిందిగా జిల్లా వ్యవసాయ అధికారిని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించామని ఏఓ అబ్దుల్‌హక్ చైర్మన్‌కు వివరించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మేనేజర్ నాగరాజు, ఏడీఏ రాజశేఖర్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టెక్నికల్ కోర్సులకు ఉచిత శిక్షణ

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఆపరేటర్లు, సీసీ టీవీ ఇన్‌స్టాలేషన్ టెక్నీషియన్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకట నరసయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ 10వ తరగతి ఉత్తీర్ణత, ఆపై చదువులు చదివిన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 9885912685ను సంప్రదించాలని కోరారు.

దరఖాస్తులను సరిచేసుకోండి

నంద్యాల(సిటీ): నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ జమకాని విద్యార్థులు వెంటనే విద్యార్థి లాగిన్‌లో విద్యా మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఆదేశాలను పాటించి వారి వివరాలను సరిచేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి అనురాధ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేషనల్ మీన్స్‌కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఎంపిక కాబడిన 2020–21, 2021–22 విద్యా సంవత్సరాలకు చెందిన విద్యార్థుల స్కాలర్‌షిప్ తమ బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యిందన్నారు. దరఖాస్తు సమయంలో బ్యాంకు ఖాతాకు సంబంధించి వివరాలు తప్పుగా నమోదు చేసిన విద్యార్థులు నమోదు చేయబడిన సెల్ నెంబర్‌కు సంక్షిప్త సందేశం అందిందన్నారు. కావున నగదు జమ కాని విద్యార్థులు తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయులు విద్యార్థి లాగిన్‌ను తనిఖీ చేయాలన్నారు.

రైస్ మిల్లులపై విజిలెన్స్ దాడులు



రైస్ మిల్లులోని బస్తాలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

బనగానపల్లెరూరల్: బనగానపల్లె పట్టణంలోని పలు రైస్ మిల్లుల్లో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. సీఐలు కేశవరెడ్డి, నాగరాజు యాదవ్, కడప విజిలెన్స్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇటీవల బనగానపల్లె పట్టణంలో రైస్ మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని నూకలుగా మార్చి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఈ దాడులు చేశారు. రైస్ మిల్లులోని బస్తాల్లో పీడీఎస్ బియ్యమా, నూకలా లేక ఇతర రకానికి చెందినవా అనేది పరిశీలనలో తెలియాల్సి ఉందని, పీడీఎస్ బియ్యానికి సంబంధించిన నూకలుగా తేలితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే రాఘవేంద్ర, ఖాన్‌రైస్ మిల్లుల్లో తూకాలు సక్రమంగా లేకపోవడంతో ఒక్కొక్క మిల్లుకు రూ.15 వేల చొప్పున జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎస్‌ఐలు జయన్న, హనుమంత్ తదితరలు పాల్గొన్నారు.

ఏపీజీఈఏ గుర్తింపు రద్దు చేయాలి

- ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న వెంగళ్‌రెడ్డి, జవహర్‌లాల్

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) దొడ్డిదారిని పొందిన గుర్తింపు (రికగ్నైజేషన్)ను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఏపీఎన్‌జీవో అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ నేతలు డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం పోరాటం చేయడం చేతగాక ప్రభుత్వంపై జీతాల కోసం గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం అత్యంత దారుణమైన విషయమన్నారు. శనివారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి జిల్లా శాఖ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్ మాట్లాడారు. ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణకు ధైర్యం ఉంటే ప్రభుత్వంపై గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదు కాపీని బయటపెట్టాలన్నారు. గవర్నర్‌కు చెప్పింది ఒకటి, బయట మాట్లాడింది మరొకటని తెలిపారు. ఉద్యోగుల హక్కులపై పోరాడటం చేతగాక... ఇతర ఉద్యోగ సంఘాలపై బురద చల్లే విధంగా మాట్లాడటాన్ని సహించేది లేదన్నారు. ఏ ఉద్యోగ సంఘమైనా ప్రభుత్వం చేత గుర్తింపు పొందాలంటే మార్గదర్శకాలు అనేకం ఉన్నాయని, వీటిని పాటించకుండా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశాల్లో ఉన్నప్పుడు అడ్డదారిన ఏపీజీఈఏకు గుర్తింపు తెచ్చుకున్నారని తెలిపారు. ఏపీజీఈఏకు ఇచ్చిన గుర్తింపు వెంటనే రద్దు చేయాలని, ఈ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని వివరించారు. ఏపీజీఈఏలో గజిటెడ్ అధికారులు మాత్రమే ఉన్నారని, అసోసియేషన్ అండతో కొంతమంది అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఏపీజీఈఏలో కొనసాగుతున్న బీసీ సంక్షేమ శాఖ ఈడీ ఎన్‌జీవోలైన వార్డన్‌లను వేధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారని విమర్శించారు. ఉద్యోగుల హక్కుల కోసం పోరాడే స్థాయి సూర్యనారాయణకు లేదన్నారు. ఏసీబీ కేసులు డీల్ చేస్తానని పేర్కొంటూ రూ.లక్షలు వసూళ్లు చేస్తున్నారని విమర్శించారు. ఉద్యోగ సంఘాలపై అవాకులు, చవాకులు పేలితే ఇకపై సహించేది లేదని హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల హక్కుల కోసం పోరాటం సాగించేది ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ మాత్రమేనని స్పష్టం చేశారు. సమావేశంలో కర్నూలు నగరశాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, అసోషియేట్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నేతలు సాంబశివారెడ్డి, కేసీహెచ్ కృష్ణుడు, రోడ్లు, భవనాల శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమణ, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, పశుసంవర్ధకశాఖ సిబ్బంది సంఘం నేత వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో బీసీలకు పెద్దపీట

- కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్, మేయర్ బీవై రామయ్య



మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలోని బీసీలకు వైఎస్సార్‌సీపీ రాజకీయంగా పెద్దపీట వేసిందని కర్నూలు ఎంపీ డాక్టర్ ఎస్ సంజీవ్‌కుమార్, కర్నూలు మేయర్ బీవై రామయ్య అన్నారు. శనివారం స్థానిక బీసీ భవన్‌లో పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో విశ్వ బ్రాహ్మణుల ఆరాధ్య దైవం బ్రహ్మశ్రీ రావుసాహెబ్ గానాల రామమూర్తి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీ, మేయర్ మాట్లాడుతూ ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో గానాల రామమూర్తి ఎమ్మెల్సీగా పనిచేశారన్నారు. తన ఆంగ్లోపన్యాసంతో బ్రిటీష్ పాలకులను మెప్పించి విశ్వ బ్రాహ్మణులను బీసీ వర్గంలో చేర్పించారన్నారు. విశ్వ బ్రాహ్మణులకు పేరుకు ముందు బ్రహ్మశ్రీ, చివరన ఆచార్య అనే పదాలకు చట్టబద్ధత చేసిన ఘనత రామమూర్తికే దక్కుతుందన్నారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధిని ఆశించి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కర్నూలులో గానాల రామమూర్తి విగ్రహం ఏర్పాటుకు వైఎస్సార్‌సీపీ సహకారం అందించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, నగర అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు, నాయకులు బత్తుల లక్ష్మికాంతయ్య, కుమ్మరి పార్వతమ్మ, శ్రీనివాసాచారి, మదన మోహనాచారి, బ్రహ్మయ్య ఆచారి, శంకరయ్య ఆచారి, తులసయ్య ఆచారి, అయ్యన్న యాదవ్, హేమంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి

- కలెక్టర్ కోటేశ్వరరావు



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ కోటేశ్వరరావు

ఓర్వకల్లు: నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు అధికారులకు సూచించారు. శనివారం మీదివేముల జగనన్న హౌసింగ్ కాలనీలో నిర్మిస్తున్న గృహాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి పలు రికార్డులు పరిశీలించి సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలను ఉగాది పర్వదినం నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. గ్రామంలోని ఇళ్ల నిర్మాణ పురోగతిని గూర్చి హౌసింగ్ అధికారులను అడుగగా, గ్రామానికి మొత్తం 30 ఇళ్లు మంజూరు కాగా, అందులో బేస్ మెంట్ దశలో 19, రూఫ్ దశలో 6, బిలో బేస్ మెంట్ దశలో 3, రూఫ్ కాంక్రీట్ దశలో 1, పూర్తి స్థాయి నిర్మాణంలో ఒకటి మాత్రమే పూర్తయిందని వివరించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయిన వాటికి నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని కలెక్టర్ సూచించారు. బేస్‌మెంట్ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణాలకు యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన కియోస్క్ యంత్రాన్ని పరిశీలించి ఈ క్రాప్ బుక్కింగ్‌పై ఆరా తీశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగప్రసాద్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, వీఆర్‌ఓ మహబూబ్‌బాషా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పుల బాధ తాళలేక..



శ్రీధర్ (ఫైల్)

ఆత్మకూరురూరల్: అప్పుల బాధ తాళలేక కరివేన గ్రామానికి చెందిన రైతు కే శ్రీధర్ (26) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొన్నాళ్ల క్రితం తండ్రి మరణించడంతో కుటుంబ బాధ్యత మోస్తున్న శ్రీధర్ తన సొంత రెండెకరాలతో పాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకుని వివిధ పంటలు సాగు చేస్తున్నాడు. కాగా రెండేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో రూ. 10 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో మనస్తాపంతో శుక్రవారం సాయంత్రం ఇంట్లోనే పురుగుమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన స్థానికులు కర్నూలు ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


గణతంత్ర వేడుకలను వైభవంగా నిర్వహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల: భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. గత వేడుకల్లో తలెత్తిన లోపాలను దృష్టిలో ఉంచుకొని పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహణపై శ్రద్ధ చూపాలన్నారు. ఆహ్వాన పత్రికలను ప్రొటోకాల్ ప్రకారం ముందుగానే పంపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ, వేదిక బ్యాక్ డ్రాప్, సీటింగ్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక చొరవ చూపాలని ఆర్డీఓ, పోలీసు అధికారులను ఆదేశించారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు, నవరత్నాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా శకటాల ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, అడిషనల్ ఎస్పీ రమణ, ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ మహేశ్వరెడ్డి అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంగమేశ్వరుడి సన్నిధిలో జస్టిస్ నరసింహారెడ్డి





కృష్ణాజలాల నుంచి బయట పడుతున్న సంగమేశ్వరుడు , పూజలు చేస్తున్న జస్టిస్ కె.నరసింహారెడ్డి

కొత్తపల్లి: ప్రాచీన సంగమేశ్వరాలయం జలాధివాసం వీడుతోంది. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 885 అడుగుల నుంచి 844 అడుగులకు చేరింది. మరికొద్ది అడుగులు తగ్గితే ఆలయం పూర్తిగా బయటపడనుంది. డైరెక్టర్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (లోకాయుక్త) జస్టిస్ కె.నరసింహారెడ్డి, కర్నూలు డీఎస్పీ తిరుపాల్‌రెడ్డి శనివారం సంగమేశ్వర ఆలయం వద్దకు బోటులో వెళ్లారు. ఆలయ పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఎగువ పుష్కర ఘాట్ వద్దనున్న ఉమామహేశ్వరాలయంలో స్వామివార్లకు నదీజలాలతో అభిషేకం నిర్వహించారు.

రూపం శాపమై.. తల్లికి భారమై!

"నవ మాసాలు మోశావు.. కడుపులో ఉన్నప్పుడు అపురూపంగా చూసుకున్నావు.. నా కోసం ఎన్నో కష్టాలు భరించావు.. నేను పుట్టగానే నా రూపం బాగోలేదని వదిలేసి వెళ్లావు.. నీ పొత్తిళ్లలో వెచ్చగా ఉండాల్సిన నేను ఇతరుల వద్ద ఉండలేక పోతున్నాను.. గుక్కపట్టి ఏడుస్తూ విసుగు తెప్పిస్తున్నాను.. నువ్వు ఎక్కడున్నా వచ్చి నన్ను తీసుకుపోమ్మా" – ఓ పసిపాప రోదన ఇదీ



నంద్యాల(అర్బన్): గ్రహణ మొర్రితో జన్మించడం ఆ బాలికకు శాపంగా మారింది. నవమాసాలు మోసిన తల్లి కన్న పేగును వదలి కఠినంగా వ్యవహరించింది. ఎక్కడో వదలి వెళితే పాప ఏమవుతుందోనన్న ఆందోళనతో ఆ తల్లి ప్రేమను చంపుకోలేక పట్టణంలోని రాఫా ఆసుపత్రిలో 21రోజుల వయస్సు ఉన్న పాపను వదిలి వెళ్లింది. అరుపులు విన్న ఆసుపత్రి సిబ్బంది పాప తల్లిదండ్రుల కోసం ఆరా తీశారు. ఎవరూ రాకపోవడంతో స్థానిక ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఐసీడీఎస్ సీడీపీఓ, అంగన్‌వాడీ హెల్పర్, సచివాలయ వలంటీర్లు పాపను కర్నూలు స్త్రీ శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన శిశు గృహం వారికి అప్పగించారు. ఈ సంఘటన ఈనెల 7వ తేదీ జరగగా కర్నూలు జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ అధికారిణి కేఎల్‌ఆర్‌కే కుమారి బాలికను సంబంధిత వ్యక్తులు తీసుకొని వెళ్లాలంటూ శనివారం ఒక ప్రకటన ద్వారా కోరారు. బాలిక కోసం ఎవరూ రాకపోతే 30 రోజుల తర్వాత చైల్డ్ వెల్ఫేర్ కమిటీ తీర్మానంతో అనాథగా నిర్ణయిస్తామన్నారు. చట్టప్రకారం దత్తత కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి సీనియారిటీ ఆధారంగా పాపను అందజేస్తామన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ బ్యానర్ల నిషేధం

నంద్యాల(సిటీ): పర్యావరణ పరిరక్షణ నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి శనివారం తెలిపారు. పట్టణంలో ప్లాస్టిక్, ప్లాస్టిక్‌తో తయారు చేయబడిన సింగల్ యూజ్ వస్తువులను, ప్లాస్టిక్ (ఫ్లెక్సీ) బ్యానర్లను పూర్తిగా నిషేధిస్తున్నామన్నారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

'పది' పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పెంపు

నంద్యాల(సిటీ): పదో తరగతి తత్కాల్ పరీక్ష రుసుం చెల్లింపు గడువు పెంచినట్లు జిల్లా విద్యా శాఖ అధికారిణి అనురాధ శనివారం తెలిపారు. గుర్తింపు ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న రెగ్యులర్, ప్రైవేట్ హాజరయ్యే విద్యార్థులు తత్కాల్ ప్రాతిపదికన పరీక్ష ఫీజు గడువు ఈనెల 23వ తేదీ వరకు ఉండగా 26వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుంతో చెల్లించాలన్నారు. అదేవిధంగా రూ. 1000 అపరాధ రుసుంతో ఈ నెల 27 వరకు ఉన్న గడువును 31వరకు పెంచామన్నారు. ఏప్రిల్ 2023 పబ్లిక్ పరీక్షలకు నమోదు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అడ్వాన్స్ సప్లిమెంటరీ 2023కు హాజరయ్యేందుకు అర్హులన్నారు.

'వంద శాతం' బాధ్యత ప్రధానోపాధ్యాయులదే



మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

- పది ఫలితాల్లో ప్రభుత్వ స్కూళ్లు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలి
- వర్క్‌షాపులో జిల్లా కలెక్టర్ కోటేశ్వరరావు



హాజరైన ప్రధానోపాధ్యాయులు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేటట్లు చేయాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులపై ఉందని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. బీక్యాంపులోని ఓ ఫంక్షన్ హాలులో సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ వేణుగోపాల్ అధ్యక్షతన శనివారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న పదో తరగతి పరీక్షలకు 31,766 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ప్రతి స్కూల్‌లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. ఈ తరగతులపై పర్యవేక్షణకు బృందాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో చర్చించాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డీఈఓ రంగారెడ్డి, సమగ్ర శిక్ష అదనపు కో ఆర్డినేటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఈ నెల చివరిలోపు అన్ని మండలాల్లో హైస్కూల్ టీచర్లతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. త్వరలోనే స్టడీ మెటీరియల్‌ను తయారు చేయించి విద్యార్థులకు అందజేస్తామన్నారు. వర్క్‌షాప్‌లో బీసీ, ఎస్సీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖల జిల్లా అధికారులు పి.వెంకటలక్ష్మమ్మ, ఎస్.ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి, మహబూబ్ బాషా, శ్రీనివాసకుమార్ ప్రసంగించారు. పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ నాగభూషణం, డిప్యూటీ డీఈఓలు, డీసీఈబీ సెక్రటరీ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

